సాగునీటి కాలువలోకి మురుగునీరు

- కొత్తపల్లిలో ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు
- ఊళ్లో మురుగు నీటి పైపు లైన్ డీ–3 ఉపకాలువకు అనుసంధానం



కొత్తపల్లి వద్ద డీ–3 ఉపకాలువలో కలుస్తున్న మురుగు నీరు

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మికాలువకు సంబంధించి డీ–3 ఉప కాలువలో ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలోని మురుగు నీటిపైపు లైన్‌ను కలిపారు. దీంతో సాగు నీరు కాస్తా మురుగు నీరుగా మారుతుంది. దీంతో పంటలకు నీరు అందించుటకు రైతులు భయపడుతున్నారు. కొత్తపల్లి గ్రామంలో నుంచి లక్ష్మి ప్రధాన కాలువతో పాటు డీ–3 ఉపకాలువ వేంపల్లి వైపు వెళ్తుంది. ఈకాలువలో పెద్ద పైపులైన్‌తో మురుగు నీరు తీసుకువచ్చి కలుపుతున్నారు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే మురుగునీటి పైపులైన్‌ను తొలగించాలని కోరుతున్నారు. డీ–3 ఉప కాలువ నీరు వేంపల్లి ఎత్తిపోతల పథకానికి సరఫరా అవుతుంది. దీంతో ఇందులోని పంపు సెట్లలో తరుచు సమస్యలు వస్తున్నాయి. అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఏడాదికొకసారి జీపీ అధికారులకు నోటీస్‌లు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మురుగు నీటి పైపు లైన్‌ను మళ్లించాలని ఆయకట్టు రైతులు వేడుకుంటున్నారు.

అధ్వానంగా మైనర్ కాలువలు

లక్ష్మికాలువను ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీలు, మైనర్ కాలువలుగా విభజించి నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామాల పక్కన ఉన్నా మైనర్ కాలువలు మరింత అధ్వానంగా మారాయి. రెంజర్ల గ్రామం నుంచి వెంచిర్యాల్ వరకు నీటిని సరఫరా చేసే మైనర్ కాలువ పూర్తిగా చెత్తతో నింపేశారు. కాలువల్లో నీటిసరఫరా సరిగా లేకపోవడంతో కాలువలనే డంపింగ్‌యార్డులుగా వినియోగిస్తున్నారు.

జీపీ అధికారులకు నోటీసులు ఇచ్చాం..

లక్ష్మికాలువకు సంబంధించి డీ–3ఉపకాలువను కొత్తపల్లి గ్రామంలో మురుగు నీటి పైపులైన్‌ను కలిపారు. ఈవిషయమై పలుమార్లు గ్రామ పెద్దలతో మాట్లాడటం జరిగింది. జీపీ అధికారులకు కూడా నోటీసులు ఇచ్చాం. ఈఅంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – సురేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

కిటకిటలాడిన ఆలయాలు



ఆర్మూర్‌లోని వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం భక్తులు ఆలయాలకు పోటెత్తారు. కుటుంబ సభ్యులతో కలిసి విఠలేశ్వర, శ్రీ వేంకటేశ్వర ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలు ఉపవాసం ఉండి వంటలు చేసుకున్నారు. – ఆర్మూర్‌టౌన్/బోధన్/రుద్రూర్/నవీపేట



రుద్రూర్ శ్రీవిఠలేశ్వర స్వామి ఆలయంలో..



యంచ విఠలేశ్వరాలయంలో..



సాలూరలో భజన చేస్తున్న భక్తులు

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



బోధన్ శక్కర్‌నగర్ చౌరస్తాలో నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



సాలూర మండల కేంద్రంలో ..

బోధన్/బోధన్ టౌన్/రుద్రూర్/రెంజల్ : దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 39 వ వర్ధంతిని ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు దేశానికి బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను గుర్తు చేస్తున్నారు.బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



కోటగిరిలో ..



తాడ్‌బిలోలి గ్రామంలో ..

మంగిరాములు మహరాజ్‌కు తులాభారం



నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రానికి సమీపంలో గల శ్రీ కేదారీశ్వర ఆశ్రమంలో ఈ నెల 3వ తేదీ నుంచి 9 వరకు సప్తాహ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్‌కు భక్తులు పాదపూజ చేసి తులాభారం చేశారు. ఆశ్రమానికి వచ్చిన భక్తులకు బొట్టుపెట్టి మహరాజ్ ఆశీర్వదించారు. ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు మహిళా ప్రాంగణంలో క్యాపింగ్ సెర్మనీ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ దుర్గాబాయ్ మహిళ శిశు వికాస కేంద్రంలో సోమవారం ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాపింగ్ సెర్మనీ నిర్వహిస్తున్నట్లు ప్రాంగణం మేనేజర్ ఇందిర తెలిపారు. కార్యక్రమానికి తెలంగాణ మహిళ, శిశు సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ బంద్రు శోభారాణి, కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్ రెడ్డి, జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

గోమాతకు అంత్యక్రియలు

నవీపేట: మండల కేంద్రంలోని హనుమాన్ మందిరానికి చెందిన గోమాత ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. స్థానిక యువకులు హిందూ సంప్రదాయ రీతిలో అంతిమ యాత్ర నిర్వహించారు. గ్రామ శివారులో అంత్యక్రియలు నిర్వహించారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

నిజామాబాద్ రూరల్: రైతులకు రుణమాఫీ, బోనస్ అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోందని మండిపడ్డారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని అన్నారు.

ఆధ్యాత్మికం

■ లింబాద్రి గుట్టపై చాతుర్మాస్య వ్రతం ప్రారంభం



మోర్తాడ్: భీమ్‌గల్‌లోని లింబాద్రి గుట్టపై ఆదివారం నుంచి చాతుర్మాస్య వ్రతం ఆరంభమైంది. ఆగస్టు 4వ తేదీ వరకూ ఈ వ్రతం కొనసాగుతుంది. చాతుర్మాస్య వ్రతం సందర్భంగా స్వామివారికి కడిచక్కెర, బెల్లం మాత్రమే నైవేద్యంగా సమర్పించనున్నారు. కూరగాయలు, పండ్లు, కొబ్బరికాయలను నైవేద్యంగా అందించడం నిషేధించారు. వ్రతం పూర్తి అయ్యే వరకూ స్వామివారి భక్తులు నైవేద్యం అంశంను దృష్టిలో ఉంచుకోవాలని పురోహితులు వెల్లడించారు.

■ నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు


ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

■ నికాల్‌పూర్‌లో ఘనంగా పల్లకీ సేవ



డొంకేశ్వర్/పెర్కిట్(ఆర్మూర్): మండలంలోని నికాల్‌పూర్ గ్రామంలోని శ్రీ లక్ష్మి వేంకటేశ్వర ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు కలిసి శ్రీవారి పల్లకీ సేవ, ఉయ్యాల సేవను కనుల పండువగా జరిపారు. ఇస్సాపల్లి వేంకటేశ్వర ఆలయంలో ఏకాదశి సందర్భంగా సామూహిక హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ విట్టం జీవన్, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుంతలమయంగా అంతర్గత రోడ్లు





హుస్నాబాద్ కాలనీలో గుంతల్లో నిలిచిన వర్షపు నీరు , జిరాయత్‌నగర్ వెళ్లేదారిలో ..

- ఆర్మూర్‌లో ఇబ్బందుల్లో వాహనదారులు
- మరమ్మతులు చేయించాలని వినతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. వర్షాకాలంలో రహదారులపై ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని జిరాయత్‌నగర్‌లోని బాలుర పాఠశాల సమీపంలో, హుస్నాబాద్‌కాలనీల్లో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారడంతో నీళ్లు నిలుస్తున్నాయి. గుంతల్లో నీరు నిలిచి కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపడుతాం

100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పట్టణంలోని రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చే చర్యలు తీసుకుంటాం. ప్రమాదాలు జరగకుండా త్వరలో పనులు ప్రారంభించి పూర్తిచేస్తాం. – రాజు, మున్సిపల్ కమిషనర్,ఆర్మూర్

అసంపూర్తిగా ఏవో కార్యాలయం



నవీపేటలోని ఏవో కార్యాలయం

నవీపేట : మండల కేంద్రంలో పదేళ్ల కిందట రూ. 6లక్షల వ్యయంతో ప్రత్యేక వ్యవసాయశాఖ కార్యాలయాన్ని నిర్మించారు. నిధులు సరిపోవడం లేదని సంబంధిత గుత్తేదారు ఇనుప షట్టర్, తలుపులను బిగించలేదు. అదనపు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించినా రాకపోవడంతో ప్రస్తుతం భవనం నిరుపయోగంగా మారింది. ఏవోకు కార్యాలయం లేకపోవడంతో ఎంపీడీవో కార్యాలయంలో పనులు చేసుకుంటున్నాడు. అధికారులు స్పందించి ఏవో కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

13న రుద్రూర్‌లో బోనాల పండుగ



రుద్రూర్: మండల కేంద్రంలో ఈనెల 13న బోనాల పండుగ నిర్వహించాలని గ్రామ పెద్దల సమక్షంలో తీర్మానించారు. ఆదివారం మండల కేంద్రంలో వివిధకుల సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది ఆషాఢమాసంలో బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, ఈ సారి నిర్వహించే పండుగకు ప్రతి కుల సంఘం నుంచి ప్రాతినిధ్యం ఉండాలని తీర్మానించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు సన్మానం



డొంకేశ్వర్(ఆర్మూర్): బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన డొంకేశ్వర్ జెడ్పీ స్కూల్ విద్యార్థులను ఎస్ఎస్‌వీ పాఠశాల యాజమాన్యం సన్మానించింది. ఎస్ఎస్‌వీ పాఠశాలలో ప్రైమరీ విద్యను అభ్యసించిన పది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం గర్వంగా ఉందని పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి అన్నారు. పాఠశాల ఇన్‌చార్జి స్వామి, నరేశ్ ఉన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా గంగాధర్, ఉపాధ్యక్షులుగా సున్నం మోహన్, నోముల నరేందర్, ప్రధాన కార్యదర్శిగా నలిమెల రేవతి గంగాధర్, మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా బద్దం రాజశేఖర్, డైరెక్టర్లుగా కనక గంగాధర్, ఏలేటి గంగాధర్, నర్సయ్యను ఎన్నుకున్నారు.

బోధన్‌లో సీఎస్ఐ చర్చి నూతన కమిటీ..




బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని సీఎస్ఐ చర్చి నూతన కమిటీతో పాటు లోకల్ కమిటీని చర్చి పాస్టర్ రెవరెండ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. చర్చి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు పాస్టర్ తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. అంతకు ముందు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేడు చలో కలెక్టరేట్



ఆర్మూర్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ నిధులను విడుదల చేయాలని సోమవారం తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అనిల్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు.పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేంద ర్, ఏరియా అధ్యక్షుడు నిఖిల్, సహాయ కార్యద ర్శి సిద్ధు, బాలాజీ, ఆనంద్, రాహుల్, భాను గౌతమ్, రజనీకాంత్, రాజు ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఆదివారం సహస్రార్జున ఆత్మీయ మిత్రమండలి ఆధ్వర్యంలో క్షత్రియ సమాజ్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. క్షత్రియ సమాజ్‌కు చెందిన యువకులు ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. దీంతో వారిని ఘనంగా సన్మానించారు. అలాగే ఇటీవల నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకు సాధించిన పవార్ కృపాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఖాందేష్ శ్రీనివాస్, గుజరాతి నివేదన్, ప్రవీణ్ పవార్, డీజే దయానంద్, ఖాందేష్ సంగీత, అంబిక పవార్, జెస్సు ఆనంద్, సాత్‌పుతే శ్రీనివాస్, బోబిడే గంగా కిషన్, షికారి రాజు, బోచ్చర్ వేణు, బారడ్ ప్రవీణ్, సంతని విజయ్, గటడి రాజేష్, అల్జాపూర్ రాజేష్, హజారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం

ఆనవాళ్లు కోల్పోయిన డ్రెయినేజీ



నందిపేట్(ఆర్మూర్): నందిపేటలోని రాజనగర్ కాలనీలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలో నిర్మించిన డ్రెయినేజీల వద్ద చెట్లు, ముళ్ల పొదలు పెరగడంతో ఆనవాళ్లు కోల్పోయాయి. దీంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి డ్రెయినేజీల వద్ద ముళ్ల పొదలను తొలగింపజేయాలి.
– సంతోష్, రాజనగర్, నందిపేట

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 బాల్కొండ : 96666 49049 బోధన్: 99636 95349

ఐడర్ రాళ్ల కొరత

- ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలతో పెరిగిన డిమాండ్
- రూ. 46కి చేరిన ధర



బాల్కొండలో నిలిచిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

బాల్కొండ: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు ప్రారంభం కావడంతో ఇంటి పునాదికి అవసరమైన ఐడర్‌రాళ్ల ధర పెరిగింది. దీంతో వీటి కొరత ఏర్పడింది. ఐడర్ రాళ్లతోనే పునాది కడుతారు. గత నెల రోజుల క్రితం వరకు ఒక్క ఐడర్ రాయి ధర రూ.36 పలకగా, ఏకంగా రూ.10 పెరిగి రూ.46కు చేరింది. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాలకు నిర్మల్ జిల్లా కుషాన్‌పల్లి, బొప్పారం, వెల్మల్ , జగిత్యాల్ జిల్లా అమ్మక్కపేట్, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి నుంచి ఐడర్ రాళ్లను సరఫరా చేస్తున్నారు. పది రోజులు ముందుగా ఆర్డర్ చెప్పి అడ్వాన్స్ ఇచ్చిన ఐడర్ రాళ్లు సమయానికి సరఫరా కావడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం పండుగ



సాలూరలో పీర్ల ఊరేగింపులో గ్రామస్తులు



ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్/బోధన్/రుద్రూర్ : ఎడపల్లి మండలం రాణాకలాన్,ఆర్మూర్ పట్టణం, సాలూర, రుద్రూర్ మండల కేంద్రాల్లో ఆదివారం మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆర్మూర్‌లో రాంమందిర్ పాఠశాల ఎదుట పీరీలను ఏర్పాటు చేశారు. గోలబంగ్లా ప్రాంతంలో బాజన్న దర్గాలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆనవాయితీ ప్రకారం పీర్లను ప్రధాన వీధుల్లో ఊరేగించారు.ఈ కార్యక్రమంలో సూర్య సమాజ్ ఆర్య కటిక సంఘ సభ్యులు ప్రకాష్, మదేష్,శ్రీనివాస్, ఈశ్వర్, సుమాన్, బాబ్లు, విజయ్, బోండ్ల ఆనంద్, మాజీ సర్పంచ్ సావిత్రి రవీందర్ గౌడ్, గ్రామస్తులు యూనిస్, మహబూబ్, రఫీ, బాబు, హైమద్, జ్ఞానేశ్వర్, జమీల్ సాదక్ తదితరులు పాల్గొన్నారు.



రుద్రూర్ మండల కేంద్రంలో..



రాణాకలాన్ గ్రామంలో..

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



భీమ్‌గల్‌లో సార్వత్రిక సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



బోధన్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బోధన్/మోర్తాడ్ : ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ జిల్లా, బోధన్ డివిజన్ ప్రతినిధులు కోరారు. ఆదివారం బోధన్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు.టీయూసీఐ ,ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ జిల్లా, డివిజన్ ప్రతినిధులు మల్లేష్ ,వరదయ్య, శంకర్‌గౌడ్, సీతారాం, పోశెట్టి, నగేష్, లక్ష్మణ్‌గౌడ్, నాగభూషణ్ గౌడ్, ప్రభాస్, తదితరులు పాల్గొన్నారు. భీమ్‌గల్‌లో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ వివిధ కార్మిక సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. నాయకులు ఓంకార్, బాలన్న, రాజన్న, గంగాధర్ తదితరులున్నారు.

ఎడపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారీ



బోధన్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ వెళ్లే రోడ్డు నివాసాలకిరువైపుల మురికి కాలువలో దోమల నివారణకు మందు పిచికారీ కార్యక్రమం చేపట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని క్లబ్ ప్రతినిధులు సూచించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పుష్పలత, మెర్సీ, కోశాధికారి గంగారెడ్డి పాల్గొన్నారు.